మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: మేడారంలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర కోసం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులును నడుపుతున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా రీజియన్ నుంచి 365 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని అమ్మవార్ల దర్శనం చేసుకోవాలని పేర్కొన్నారు.



సిండికేటు స్టిక్కర్ తొలగించి బెల్ట్‌షాపుల్లో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన బాటిళ్లు

- ఇచ్చోడ సిండికేటు వ్యాపారులపై ఎక్సైజ్ శాఖ సీరియస్
- మద్యం బాటిళ్లపై సిండికేటు స్టిక్కర్ తొలగింపు
- ఎమ్మార్పీ ధరలకే బెల్ట్‌షాపులకు మద్యం విక్రయాలు
- ఏజెన్సీలో దుమారం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లిక్కర్ మాఫియాకు ఝలక్!

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం సిండికేటు వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఏజెన్సీలో లిక్కర్ దందా' కథనం వ్యాపారులకు ఝలక్ ఇచ్చింది. దీంతో ఉలిక్కిపడిన సిండికేటు వ్యాపారులు హడావుడిగా తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. హోల్‌సేల్ వైన్‌షాపులో నిల్వ ఉంచిన మద్యం స్టాక్‌ను ఇతర చోటకు తరలించి సంబంధిత స్టాక్ రిజిస్టర్‌లో దిద్దుబాటు చర్యలను చేపట్టారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోనే లిక్కర్ వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి మద్యం విక్రయాల్లో కొత్త విధానానికి తెరలేపారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లూ అందరి కళ్లుగప్పి అక్రమ దందాకు పాల్పడిన వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. అయితే దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా ఇన్నాళ్లూ అడ్డగోలుగా మద్యం విక్రయాలను జరిపి మందుబాబులను నిలువుదోపిడీ చేసిన వైన్స్‌యజమానులు పూర్తిగా సైలెంట్ అయిపోయారు. కానీ కొందరు నేతలు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సిండికేటు వ్యాపారుల అక్రమదందాపై మరింత లోతుగా దర్యాప్తు జరిపిం చి దీనికి సహకరించిన జిల్లా అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి సిండికేటు వ్యాపారుల పెత్తనం, అధిక ధరలకు మద్యాన్ని విక్రయించడంపై వాస్తవ విషయాలతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో దుమారం రేపింది.

బాటిళ్లపై స్టిక్కర్ మాయం

ఏజెన్సీలో లిక్కర్ దందా కథనంతో అప్రమత్తమైన వ్యాపారులు మద్యం బాటిళ్లపై హుటాహుటిన సిండికేటు స్టిక్కర్‌ను తొలగించి శనివారం బెల్ట్ షాపులకు మద్యాన్ని తరలించారు. అలాగే బెల్ట్‌షాపుల్లో స్టిక్కర్‌తో నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను వెనక్కి తీసుకున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టే అవకాశం ఉండడంతో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. ఇన్నాళ్లు మద్యం బాటిళ్ల పై సిండికేటు స్టిక్కర్లను వేసేందుకు నియమించుకున్న ప్రత్యేక సిబ్బందిని కూడా తొలగించినట్లు తెలిసింది. ఇన్నాళ్లు ఒకే వైన్‌షాపు నుంచి హోల్‌సెల్‌గా అమ్మకాలు జరుపడంతో స్టాక్ నిల్వల్లోను భారీ తేడాలు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మిగిలిన ఇతర షాపుల్లో నుంచి మద్యాన్ని తరలించి అధికారుల తనిఖీల్లో తేడాలు రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. ఇకపై మద్యం బాటిళ్లపై స్టిక్కర్ అతికించిన సీల్ తొలగించిన కేసులు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో వ్యాపారులు వెనక్కి తగ్గినట్లు కన్పిస్తోంది. అసలు వైన్స్‌షాపు యజమానులు హోల్‌సేల్‌గా పెద్ద మొత్తంలో అమ్మకాలు చేపట్టే అవకాశం కూడా లేదని అధికారులు చెబుతున్నారు.

అధిక ధరలకు చెక్..



నిబంధనలకు విరుద్ధంగా అక్రమదందాకు పాల్పడిన వ్యాపారులకు చెక్‌పడింది. ఇన్నాళ్లు సిండికేటు వ్యాపారులు ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.5 తీసుకుని మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలించారు. దీనిపై బెల్ట్‌షాపు యజమానులు కూడా రూ.10లు వడ్డించి అధికధరకు అమ్మేవారు. మొత్తానికి ఎమ్మార్పీ ధరకంటే రూ.15 అదనంగా వసూలు చేసి సిండికేటు వ్యాపారులు, బెల్ట్‌షాపుల యజమానులు దోపిడీ దందాకు ఎగబడ్డారు. ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిత్యం సుమారుగా 300 వరకు లిక్కర్ కేసుల విక్రయాలు జరుగుతాయి. ఈ లెక్కన ఒక్కో బాటిల్‌పై రూ.15 చొప్పున 300 కేసులను పరిగణలోకి తీసుకుంటే రోజుకు రూ.2 లక్షల 16వేల ఆదాయం సమకూరుతోంది. అంటే నెలకు రూ.64 లక్షల 80 వేలు సిండికేటు బెల్ట్‌షాపుల యజమానుల జేబుల్లోకి వెళ్తున్నాయి. దీంతో ఏ మేరకు అక్రమ దందాసాగుతుందో అర్థమవుతుంది. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నోరు మెదుపక పోవడం అనుమానాలకు తావిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో కళ్లు తెరిచిన ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు అక్రమదందాపై హెచ్చరికలు చేయడంతో ఎమ్మార్పీ ధరలకే వ్యాపారులు మద్యాన్ని విక్రయించడం ప్రారంభించారు. దీంతో మద్యం బాటిళ్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. సామాన్య, మధ్యతరగతి వారికి ధరలు అందుబాటులోకి రావడంతో 'ఆంధ్రజ్యోతి'ని పలువురు అభినందిస్తున్నారు

ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్రపై విద్యార్థులకు మాక్ సమావేశం



పాఠశాలలో మాక్ జిల్లా పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న విద్యార్థులు

తలమడుగు, ఫిబ్రవరి 17: ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి ఏవిధంగా తీసుకెళ్తారు.. పరి ష్కరించేందుకు అధికారుల పాత్ర అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు గాను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు మాక్ జిల్లా పరిషత్ సమా వేశాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావ్ ఈ సందర్భంగా సమావేశంలో పర్యావరణ పరిరక్షణ ప్రజా సమస్యల పరిష్కారం. సమ్మక్క సారక్క జాతరలో భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు తెలిపారు. విద్యార్థి దశనుంచే వీటిపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పీటీసీలు

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 17: బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ కోరారు. శనివారం పోర్ట్ ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ తుల శ్రీనివాస్, భీంపూర్ జడ్పీటీసీ సుధాకర్‌లతో కలిసి మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. బోథ్ నియోజకవర్గానికి నిధులు మంజూరు ఇవ్వడంతోపాటు సోనాల మండల కేంద్రానికి ఇరువైపులా 50లక్షల రూపాయలతో సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి సంబంధిత సీఈవో మాట్లాడి తక్షణమే నిధులు మంజూరు చేశారు.

సంక్షిప్త సమాచారం

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

బోథ్, ఫిబ్రవరి17: ఈనెల 20న నిర్వహించనున్న సేవాలాల్ జయంతిని విజయవంతం చేసేందుకు బంజారాలు తరలిరావాలని పిలుపునిస్తూ బంజారా సంఘం నాయకులు, ఉద్యోగ సంఘాల శనివారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి అన్ని తండాల నుంచి తరలిరావాలని కోరారు.

ఎలక్ట్రికల్స్ దుకాణంలో చోరీ

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి17: పట్టణంలోని రాములు కాంప్లెక్స్ సమీపంలో గల శ్రీమత్‌వాఘ్మారే ఎలక్ట్రికల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. శెటర్ తాళాలు పగులగొట్టి అందులోని సుమారు రూ.5లక్షల విలువైన రాగి తీగలను దొంగలించారు. శనివారం ఉదయం ఆ దుకాణం పక్కన ఉన్న హోటల్ యజమాని దుకాణం శెటర్ తెరిచి ఉండడాన్ని గమనించి యజమానికి సమాచారం ఇవ్వడంతో చోరి విషయం బయటపడింది. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు.

తహసీల్దార్, ఎస్సైలను సన్మానించిన నాయకులు

భీంపూర్, ఫిబ్రవరి17: బదిలీల్లో భాగంగా భీంపూర్ మండలానికి వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రదీప్‌లను శనివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. కలిసిన వారిలో కామన్ అశోక్, అన్ను పటేల్, రమేష్, సంగమిత్ గంగారెడ్డి, మతిన్ పటేల్, చిల్కూరి సంజీవ్‌రెడ్డి, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, కేమా గంగయ్య, జలిగిరి మల్లేష్, నరేష్ యాదవ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు కనుగుట్ట పాఠశాల ఎంపిక

బోథ్, ఫిబ్రవరి17: మండలంలోని కనుగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టును విద్యార్థిని నల్ల రచన రూపొందించింది. దీంతో గైడ్‌టీచరుగా నిఖిలేష్, విద్యార్థిని రచనను మండల నోడల్ ఆఫీసర్, ప్రధాన ఉపాధ్యాయులు ఈదాపు పోశెట్టి గ్రామస్థులు అభినందించారు. అంతేగాక జాతీయ సైన్స్‌స్పైర్‌లో పాఠశాలకు చెందిన రంజిత్, ఎస్కే తనిష్కాలు మండలస్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాల పేరు రాష్ట్ర స్థాయిలో నిలిపినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఎంపీడీవోను సన్మానించిన మిత్ర బృందం

బోథ్, ఫిబ్రవరి 17 : బోథ్ ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన ఎల్.రమేష్‌ను ఆయన మిత్ర బృందం శనివారం ఎంపీడీవో కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఎంపీడీవో సన్మానించిన వారిలో ఆయన గురువు అయిన రవీందర్ ఉన్నారు.

చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి వరప్రసాద్



జిల్లా ప్రధాన న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న జైనథ్ సీఐ

జైనథ్ ఫిబ్రవరి 17: సమాజంలో ఉన్న ప్రతీ పౌరుడు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఆర్ఆర్‌వీ సీహెచ్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన జైనథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలల్లో ర్యాగింగ్ చేస్తే దాని పర్యావసానం ఎలా ఉంటుంది.. విద్యార్థులు ఎలా ఉండాలి.. యుక్త వయస్సులో విద్యార్థులు చేయకూడని తప్పులపై సవివరంగా వివరించారు. వివిధ న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ గ్రామ మాజీ సర్పంచ్ డి.దేవన్న, ఎంపీటీసీ కె.సుదర్శన్, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శాంతికుమారి, హెచ్ఎం లస్మన్న, పీడీ దయానంద్ రెడ్డి, నాయకులు పి.గణేష్ యాదవ్‌ల తోపాటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్దే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం'



భూమిపూజ చేస్తున్న బ్రహ్మానంద్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 17: గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. శనివారం మండలంలోని మాన్కపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ ప్రజల అవసరాలను తీరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోండిబా, జలీమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయుడు

పాఠశాలలో ఉపాధ్యాయుడి నియామకం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భీంపూర్, ఫిబ్రవరి 17: మండలం అంతర్‌గాం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఈనెల 3వ తేదిన ఆంధ్రజ్యోతి మినీలో 'విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులేరి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. భగవాన్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రీయతమ్‌ను అంతర్‌గాం పాఠశాలకు పంపించారు. సదరు ఉపాధ్యాయుడు పిల్లలకు విద్యాబోధనలు చేశాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ పీవో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి17: ఈనెల 20న నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం రామ్‌లీలా మైదానంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని, శాఖల వారీగా కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు డీఎంఅండ్‌హెచ్‌వో నరేందర్ రాథోడ్, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పాటన్‌లో రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న సంగెపుబొర్రన్న

కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

జైనథ్, ఫిబ్రవరి17: బేల మండలంలోని పటన్ గ్రామానికి చెందిన కౌలు రైతు ఏనుగు లచ్చారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటన్ గ్రామానికి చేరుకుని లచ్చారెడ్డి కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న క్రమంలో అతివృష్టి అనావృష్టి కారణాలతో వ్యవసాయానికి చేసిన అప్పులు కట్టలేక లచ్చారెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 194 ప్రకారంగా రైతుకు రూ.6 లక్షలను అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫైదుల్లా ఖాన్, రైతు నాయకులు వికాస్, నర్సారెడ్డి, దిగంబర్ హరీశ్‌రెడ్డిలతో పాటు పటన్ గ్రామస్థులు ఉన్నారు.

'క్రాంతివీర్ లాహుజీ సాల్వే సేవలు చిరస్మరణీయం'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: బడుగు బలహీన వర్గాల విద్య కోసం క్రాంతివీర్ లాహుజి సాల్వే ఎనలేని కృషి చేశారని దళిత సంఘాల నాయకులు గణేష్ అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్‌లోని సాల్వేచౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నవ సమాజ నిర్మాణం కోసం ఎంతో మహనీయులను చైతన్యవంతులు చేసి వారికి గురువుగా సాల్వే నిలిచారన్నారు. స్వతంత్ర ఉద్యమంలో ఆయన పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు.

బీసీ జనగణన తీర్మానంపై హర్షం

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి17: బీసీ జనగణన చేపట్టడానికి శాసనసభలో పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళాల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ జనగణన చేపడతామని చెప్పిందే గాని చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇందులో చిక్కాల దత్తు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలాల శ్రీనివాస్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం కేసీఆర్ జన్మదిన వేడుకలను జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవతరణలో ప్రాణాలను సైతం పనంగా పెట్టి నేడు తెలంగాణ రాష్ట్ర బాపుగా పేరు ప్రఖ్యాతలు పొందుతున్నారన్నారు. ఉద్యమ నాయకుడే రాష్ట్ర శ్రేయస్సుకు విశేష సేవలను అందించి బడుగు బలహీన వర్గాలతో పాటు ఉన్నత విద్యకు బాటలు వేసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు.యావత్ రాష్ట్రమంతా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు అంగ రంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలను మోసం చేసే పార్టీలను ప్రతిపక్షంతో అండగా నిలబడి వారిసమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రైతు సమన్వయ అధ్యక్షుడు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చెర్మన్ మెట్టు ప్రహ్లాద్, జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, యూనిస్‌అక్బాని, సాజీదొద్దిన్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మహిళ అధ్యక్ష కార్యదర్శులు స్వరూప, భోడగంమమత, కస్తాల ప్రేమల, సుల్తానా, దాసరిరమేష్ పాల్గొన్నారు.



జోగురామన్నకు కేక్ తినిపిస్తున్న నాయకులు

ఇచ్చోడ: బీఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ మొదటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావ్ జన్మదిన వేడుకలన ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ముక్రా(కె) మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్, నాయకులు రమేష్, షబ్బీర్, రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో నేరడిగొండ బీఆర్ఎస్‌పార్టీ కుటుంబసభ్యులందరు పాల్గొన్నారు.

ఉట్నూర్: తెలంగాణ రాష్ట్ర సాధకులు మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ సామప్రభాకర్‌రెడ్డి, రమేష్‌పటేల్,సింగరేభారత్, ముజీబ్‌ఖాన్, సాడిగే రాజకుమార్, సిడం సోనేరావు, జుబేర్‌ఖాన్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలో తెలంగాణ రాష్ట్రమొదటి సీఎం అయిన కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

తలమడుగు: మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలు శనివారం మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డోంగ్రే మారుతి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఖానాపూర్: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పోరాట యోధుడని పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్ మాజీజడ్పీటీసీ తదితరులున్నారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్.. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.



చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

రుణాలను సద్వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 17: బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయంసహాయక సంఘాలు ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీ మున్నూరుకాపు సంఘ భవనంలో యూబీఐ రుణమేళా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత, సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా 54సంఘాలకు రూ.7.5 కోట్ల రుణాలను చెక్కు రూపంలో అందచేశారు. ఇందులో భైంసాఎంపీపీ అబ్దుల్ రజాక్, యూబీఐ అధికారులతో పాటు ఐకేపీ అధికారులు, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ బి.గంగాధర్, బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

● మెరుగైన జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, నిత్యం వ్యాయామం, నడక లాంటి చేపడుతూ మెరుగైన జీవనశైలితో వ్యవహరిస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని లైఫ్ స్టైల్ వైద్య నిపుణులు డా. రాజేందర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో హెల్తీ లైఫ్ స్టైల్ వెల్నెస్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు శారీరక శ్రమ, ఒత్తిడిని నియంత్రించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఇదేక్రమంలో మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. సమ్మిట్‌ను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి నిర్వాహకులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావ్, టౌన్ సీఐ రాజారెడ్డి, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.దామోదర్‌రెడ్డి, గురుకృపా వోకేషనల్ కళాశాల డైరెక్టర్ డా.ముష్కం రామకృష్ణ గౌడ్, అధ్యక్షురాలు ముష్కం ప్రసన్నరాణి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ సాధుల కృష్ణదాస్, తదితరులు పాల్గొన్నారు.

20న విజయ్ సంకల్ప యాత్ర బహిరంగ సభ

● యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ ప్రతినిధుల పిలుపు

భైంసా,ఫిబ్రవరి17: కేంద్రంలో మూడో పర్యాయం మోదీసర్కార్ కోసం ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న విజయ్ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి వెల్లడించారు. శనివారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 20న జిల్లాలోని బాసర నుంచి కుమరం భీం విజయ సంకల్ప యాత్ర ప్రారంభమవుతుందని పెర్కొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లుగా వివరించారు. సభకు అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ హాజరవుతున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఇందులో బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణ రెడ్డి, భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, మున్సిపల్ మాజీచైర్మన్ బి.గంగాధర్, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ రాజేష్‌బాబు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

● నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 17: వేవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో నిత్యం జరిగే పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, ప్రతి ఇంటి నుండి తడిచెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని అన్నారు. నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏ ర్పాటుపై పర్యవేక్షించాలని, గ్రామసభలలో ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాల పై సమీక్షించాలన్నారు. ఈనెల చివరి నాటికి 100శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈజీ ఎస్ ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల పూర్తికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం గ్రామ, మండలాల వారీగా వివిధ అంశాల ప్రగతిపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆయా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే

ముథోల్, ఫిబ్రవరి17: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని వెల్లడించారు. రాంటెక్ గ్రామంలో రూ. 4.5లక్షలు, మచ్కల్‌లో రూ.1.5లక్షలతో మురికి కాలువల నిర్మాణం పనులకు, న్యూ ముద్గల్‌లో రూ.3లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజచేశారు. అలాగే పాతముద్గల్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీటీసీ నిధులు రూ.2.5లక్షలతో భూమిపూజ చేశారు. అవసరమైతే ఇన్‌చార్జి మంత్రి సీతక్క నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ప్రహరీ పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యం రెడ్డి, ముథోల్ మండలం ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీలు ఆత్మస్వరూప్ నాయకులు గోడిపి ప్రేమ్‌నాథ్ రెడ్డి, కిషన్ పటేల్, భుజంగ్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీలకు ఇవ్వాలి'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి17: కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్ డిమాండ్‌చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్బండ వర్గాల సంక్షేమాన్ని కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన ఎస్సీ సామాజికవర్గానికి ఈసారి జిల్లా అధ్యక్ష పదవిని ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావు, టీపీసీసీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ డవలే ప్రశాంత్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సేవాలాల్ జయంతి వేడుకల్లో అందరూ పాల్గొనాలి'

ఇచ్చోడ, ఫిబ్రవరి17: ఈనెల 20న జిల్లాకేంద్రంలోని రాంలీల మైదానంలో నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ జయంతి వేడుకలకు బంజారాలు ప్రజలంతా పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల బంజారా సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా జయంతికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చౌహాన్ వినాయక్‌రావ్, అధ్యక్షుడు బలరాం నాయక్, ఉపాధ్యక్షుడు రాథోడ్ బాబులాల్, నాయక్ రాథోడ్ శివలాల్, ఆడే మానాజీ, ఉత్తం, రమేష్, ప్రకాష్, బలరాం, నికేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సోయంపై వ్యాఖ్యలు చేయలేదు

● మాజీ ఎంపీ రమేష్ రాథోడ్

ఖానాపూర్, ఫిబ్రవరి17: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై తాను ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదని మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. హైదరాబాద్‌లో తానూ బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు వ్యవహారంపై ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై మాట్లాడినట్లు కొంతమంది వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పొత్తు వ్యవహారం జాతీయస్థాయిలో ఉంటుందని, అది తనస్థాయికి సరిపోదని తెలిపారు. స్థాయికి మించి తాను మాట్లాడినట్లు మీడియా వక్రీకరించిందని, అధిష్ఠానం ఆదేశాలతోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లానని తెలిపారు. తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు కొన్నిపార్టీలు కుట్రలు పన్ను తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కూరలో వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

జైనథ్, ఫిబ్రవరి17: మండలంలోని కూర గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం హోమానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగాశాలలో గ్రామానికి చెందిన దంపతుల జంటలతో కలిసి యాగశాలలో ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో శ్రీవెంకటేశ్వర స్వామి పద్మవతి అలువెలి మంగమ్మ విగ్రహాలను ప్రతిష్టించారు.ఈ నెల 18న జరగనున్న స్వామివారి కళ్యాణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగుల పూలతో పాటు వివిధ విద్యుత్ బల్బులతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల విజయవంతం చేయడానికి గ్రామప్రజలు మహిళలు, వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఎస్జీటీల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

● ఎస్టీయూ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి17: సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని, పండితులు, పీఈటీలను ఉన్నతీకరించడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి జే. లక్ష్మణ్, నాయకులు టి.గంగాధర్, గోవింద్ నాయక్, సిరాజుద్దీన్, ఎం. శ్రీకాంత్, బి.వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

'వర్గీకరణ పేరుతో దళితులను విడదీస్తున్న మోదీ'

ఖానాపూర్, ఫిబ్రవరి 17: ఎస్సీ వర్గీకరణ పేరిట దళితులను ప్రధాని నరేంద్రమోదీ విడదీస్తున్నారని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కాలం చెల్లిన అంశమని, ఒక వర్గం ఓట్ల కోసం మాత్రమే బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ఆర్టికల్ 341 మార్పి అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందన్నారు. ఈనెల 25న కాకినాడలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో కాకినాడ రాజ్యాంగ సభకు మాలమహానాడు సోదరులంతా జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

● అలేఖ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖానాపూర్ పట్టణంలో అత్యంత దారుణంగా నడిరోడ్డుపై హత్యకు గురైన అలేఖ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. అలేఖ్య మరణం పట్ల 2 నిమిషాలు మౌనం పాటించి ఆమెకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, ఈదుల్ల ప్రతాప్, సురేష్, ద్యావతి రాజేశ్వర్, తదితరులున్నారు.

నిర్మల్ ఆర్టీవోగా దుర్గాప్రసాద్

● రవాణా శాఖలో భారీగా బదిలీలు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి17: నిర్మల్ ఆర్టీవోగా గ్రూప్-1 అధికారి దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. రవాణా శాఖలో జరిగిన భారీ బదిలీల్లో భాగంగా దుర్గాప్రసాద్‌ను నిర్మల్‌కు కేటాయించారు. అలాగే ఇక్కడ ఇన్‌చార్జి ఆర్టీవోగా వ్యవహరించిన ఎంవీఐ అజయ్ కుమార్‌రెడ్డి బార్డర్‌లోని సాలూర చెక్‌పోస్ట్‌కు బదిలీ అయ్యారు. కాగా నిర్మల్ ఎంవీఐగా మహేందర్, ఏఎం వీఐగా ముర్తుజా అలీలు నియమితులయ్యారు.

హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ

కుభీర్, ఫిబ్రవరి17: మండలంలోని పల్సి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంతుల సురేష్‌కు శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసు జారీ అయ్యాయి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీల పట్ల కొంతకాలంగా కే.సాగర్ అనే ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కథనాలు వచ్చాయి. దీంతో సరిగా పర్యవేక్షణ చేయని కారణంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సురేష్‌కు షోకాజ్ నోటీసు అందినట్లు సమాచారం.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి

నిర్మల్‌రూరల్, ఫిబ్రవరి 17: హరిహర క్షేత్ర ఆలయ గురుస్వామి మూర్తి సతీమణి రాజ్యలక్ష్మి అంత్యక్రియల్లో మాజీ మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కాంట్రాక్టర్ లక్కిడి జగన్మోహన్‌రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్, పప్పిసేటు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీల మనుగడ కోసం పోరాడాలి

● నేపాల్ సెమినార్‌లో మర్సుకోల తిరుపతి

ఉట్నూర్, ఫిబ్రవరి17: ప్రపంచంలోని ఆదివాసీలందరూ తమ మనుగడ కోసం ఆదివాసీ సమూహాలన్నీ ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందని ఆదివాసీ ఉద్యమ నేత మర్సుకోల తిరుపతి అన్నారు. నేపాల్‌లోని ఖాట్మాండులో వరల్డ్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో వివిధ దేశాల ప్రజాప్రతినిధులు హాజరైన సెమినార్‌కి ఆదిలాబాద్ జిల్లాకి చెందిన ఆదివాసీ ఉద్యమనాయకుడు మర్సుకోల తిరుపతి హాజరయ్యారు. శనివారం జరిగిన సెమినార్‌లో తెలంగాణలో ఆదివాసీ, ఆదిమ గిరిజన తెగలైనా కొలం, తోటి తదితర తెగలు ఎదురుకుంటున్న వ్యవసాయ, విద్యవైద్య సమస్యలను ప్రస్తావించారు. తరతరాలుగా ఆదిమ గిరిజన జాతులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆదిమ గిరిజనజాతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వాలుకృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని ఏకస్వభావం కలిగిన ఆదివాసీ సమూహాలు ఐక్యమైనప్పుడు ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు కాపాడబడతాయని పేర్కొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి17: హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని క్రాంతికారి హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ అడ్వైజర్ సంతోష్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రం నుంచి వస్తున్న లేబర్లను కాకుండా స్థానిక హమాలీలకు పని కల్పించాలన్నారు. ప్రతీ హమాలీ కార్మికునికి లేబర్‌కార్డు మంజూరు చేయాలని, కలెక్టర్ దృష్టికి హమాలీ కార్మికుల సమస్యలను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

నేడు జిల్లాకేంద్రంలో సినీ నటుల ఎంపిక

ముథోల్, ఫిబ్రవరి 17 : ఓ తెలుగు చలన చిత్రంలో నటించేందుకు ఆసక్తిగల కళాకారులను ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో ఎంపిక చేయనున్నట్టు చిత్ర దర్శకుడు కొప్పుల చిన్నయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గొల్లపేట్ అంబేద్కర్ విగ్రహం పక్కన గల జీఆర్‌బీ అపార్ట్‌మెంట్స్ రూమ్ నెంబర్ 101లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆడిషన్స్ జరుగుతాయని తెలిపారు. 20 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల వయసు గల కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎత్తిపోతలు.. ఉత్తిపోతలే!

ఆంధ్రజ్యోతి ఫోకస్

- జిల్లాలో అనేక ప్రాంతాల్లో మూతపడ్డ ఎత్తిపోతల పథకాలు
- నిధుల కొరతతో నిలిచి పోయిన మరమ్మతులు
- నిరుపయోగంగా సామగ్రి
- అడుగడుగునా అధికారుల నిర్వహణ లోపం
- అంతటా నీరు గారిన సాగు లక్ష్యం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు


బీరవెల్లిలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతలు



వృథాగా ఉన్న నర్సాపూర్(జి) ఎత్తిపోతల పథకం

నిర్మల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) :

జిల్లా వ్యాప్తంగా బీడు భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ ఆశించిన మేరకు పని చేయడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు నిర్మించగా.. ఇందులో నుంచి సగానికి పైగా పని చేయడం లేదన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్వాకం కారణంగానే కాకుండా రైతుల అవగాహన లోపం, నిధుల కొరత ఈ పథకాల నిర్వహణకు సమస్యగా మారిందన్న వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడం, అలాగే నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించకపోతుండడం ఈ పథకాల అమలుకు శాపంగా మారిందని అంటున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు ఆశించిన మేరకు లక్ష్యాన్ని సాధించడంలో విఫలమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఐడీసీ అధికారుల లెక్కల ప్రకారం.. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 68 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఇందులో నుంచి నిర్మల్ జిల్లాలో మొత్తం 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. కాగా.. నిర్మల్ జిల్లాలో జిల్లాలో కేవలం 19 ఎత్తిపోతల పథకాలు మాత్రమే పని చేస్తుండగా.. మిగతా 22 ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలున్నాయి. అలాగే మంచిర్యాల జిల్లాలో మొత్తం 13 ఎత్తిపోతల పథకాలకు గాను ఏడు ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదంటున్నారు. కొమరం భీమ్, ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు ఎత్తిపోతల పథకాలు ఆదిలాబాద్‌లో రెండు ఎత్తిపోతల పథకాలు పని చేయకుండా నిరుపయోగంగా మారాయి. అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయంటున్నారు. అధికారులు చెబుతున్నట్లుగా పని చేస్తున్న ఎత్తిపోతల పథకాలలో కూడా అనేక లోపాలున్నట్లు విమర్శలున్నాయి. జలాశయాలు, నదులు, వాగులు ఉన్న ప్రాంతంలో ఈ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని జలాశయాలను లక్ష్యంగా చేసుకొని నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా వందలాది ఎకరాలకు సాగు నీరును అందించాలన్న లక్ష్యాన్ని నిర్ధారించారు. చాలాచోట్ల ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతుండడమే సమస్యలు అసలు కారణంగా పేర్కొంటున్నారు. ఇలా నెలల తరబడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పరికరాలు, పంపులు, మోటార్లు, పైప్‌లైన్లకు మరమ్మతులు చేయకపోతుండడం ఈ పథకానికి ఆటంకంగా మారుతోంది. అప్పటి ప్రభుత్వం ఓవైపు ఇరిగేషన్ రంగానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించినప్పటికీ.. ఎత్తిపోతల పథకాల నిర్వహణ విషయంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదల విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఫిర్యాదులున్నాయి.

నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రైతులకు అప్పగించలేదు..

జిల్లాలోని లోకేశ్వరం మండలం మన్మధ్ గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటివరకు సంబంధిత శాఖ అధికారులు ఆ పథకం పరిధిలోని రైతులకు అప్పగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ పథకం చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు ఇప్పటివరకు పూర్తికాలేదు. రైతులు చాలాసార్లు అధికారులకు ఈ విషయమై వినతి పత్రాలు అందజేసినప్పటికీ వారిలో స్పందన కనిపించడం లేదంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ పథకం నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి.

కోట్ల రూపాయల పథకాలు వృథా

కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలన్నీ చాలాచోట్ల వృథాగా ఉండడం గమనార్హం. కొన్ని ఎత్తిపోతల పథకాల వద్ద మోటార్లు చెడిపోవడం అలాగే పంప్ హౌస్‌లలో రిపేర్లు రావడం, పైప్‌లైన్లు లీకేజీ కావం లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతుల పనులు చేపట్టినట్లయితే ఈ పథకాలన్నీ సక్రమంగా పని చేసే అవకాశాలుంటాయి. నిధుల కొరత కారణంగా మరమ్మతుల పనులు ఎప్పటికప్పుడు చేయలేకపోతున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా నిధుల కొరత కారణంగానే ఈ పథకాలు నిర్వీర్యమవుతున్నాయని అంటున్నారు. అలాగే రైతులకు కూడా పూర్తిస్థాయిలో పథకాల నిర్వహణపై అవగాహన కల్పించకపోవడం, సంబంధిత ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతు సంఘాల సభ్యులకు నిరంతరం శిక్షణలు ఇవ్వకపోవడం లాంటి అంశాలు ఈ పథకాల వైఫల్యానికి కారణం అవుతున్నాయి.

అధికారులపై విచారణ జరిపించాలి

- గంగుబాయి, రైతు, నర్సాపూర్ (జి)

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఎత్తిపోతల పథకం నీరు అందించక 9 ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ రైతులకు గ్రామసభ నిర్వహించిన అధికారులు అప్పగించలేదు. మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని వృథా చేశారు. ప్రజాధనం వృథా చేసిన అధికారులపై విచారణ చేపట్టాలి.

పని చేయని లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఏంటి ప్రయోజనం !?

- మేకల రాజేందర్ యాదవ్ (రైతు, కనకాపూర్)



పని చేయని లిఫ్ట్ ఇరిగేషన్ వలన ప్రయోజనం ఏంటి!? తూతూ మంత్రంగా నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ వల్ల ప్రభుత్వ ధనం వృథా అయ్యిందే తప్పా.. రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. కనకాపూర్ గ్రామంతో పాటు వడ్యాల్, తిరుపెల్లి తదితర గ్రామాల్లో ఉన్న లిఫ్ట్‌ల ద్వారా ప్రస్తుతం ఎలాంటి నీరు సరఫరా కావడం లేదు. పైన గల లిఫ్టులలో కొన్ని మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం ఈ లిఫ్ట్‌లన్నింటినీ ఉపయోగంలోకి తెస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.

పునరుద్ధరించి.. రైతులకు సాగు నీరు అందించాలి

- కండెల శ్రీనివాస్ రెడ్డి (రైతు, దిలావర్‌పూర్)



ఎత్తిపోతల పథకాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు అందలేదు. 28 సంవత్సరాల క్రితం నిర్మించిన దిలావర్‌పూర్, బన్సపల్లి, న్యూలోలం ఎత్తిపోతల పథకాలను రూ. లక్షలు వెచ్చించి నిర్మించారు. నీళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించాలి.


సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

భైంసా రూరల్, ఫిబ్రవరి 17 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లకు మంజూరు చేసిందని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. భైంసా మండలంలోని వాలేగాం గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించారు. దశల వారీగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ నాయకులు బి. శంకర్, సోలంకి భీమ్ రావు, పండిత్ రావు, దిగంబర్, సాయినాథ్ పటేల్, తదితరులు ఉన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

విజయానికి సమష్టి కృషి అవసరం

- టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల ప్రారంభంలో చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 : క్రీడల్లో విజయం సాధించాలంటే సమష్టి కృషి అవసరమని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం జేవీఎన్ఆర్ స్కూల్ మైదానంలో టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక, శరీర దారుఢ్యాన్ని పెంచుతాయన్నారు. 15 రోజులపాటు జరుగనున్న పోటీల్లో నిర్మల్‌తో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాకు చెందిన 45 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సుదర్శన్, కోచ్ సుమన్, కౌన్సిలర్ లక్కాకుల నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కుభీర్ సర్వసభ్య సమావేశం

కుభీర్ , ఫిబ్రవరి 17 : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి మండల అధ్యక్షురాలు తూం లక్ష్మీ అధ్యక్షతన వహించారు. సమావేశంలో అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆ తర్వాత తహసీల్దార్ సోము మాట్లాడుతూ.. 13,392 తెలుపు రేషన్ కార్డులు, 792అంత్యోదయ కార్డులకు గాను ప్రతి నెల కుటుం బంలోని ఒక్కో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున 2,897. 74 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దిన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్షం నాయకులు

- అలేఖ్య హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి
- అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఖానాపూర్ అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన
- 19న ఖానాపూర్‌లో మహా ధర్నాకు పిలుపు

ఖానాపూర్, ఫిబ్రవరి 17 : రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన అలేఖ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఖానాపూర్‌లో సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అధ్యక్షతన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న, బీజేపీ అధ్యక్షుడు నాయిని సంతోష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్ రావ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఖానాపూర్ పట్టణ నడిరోడ్డుపై తన కుటుంబ సభ్యులతో కలిసి నడిచి వెళ్తున్న యువతి షెట్పెల్లి అలేఖ్యను అమానవీయంగా, అత్యంత దారుణంగా హత్య చేసిన ప్రేమోన్మాది జుంకింది శ్రీకాంత్‌ను, అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ హత్య కేసులో ఉన్న ప్రతీ ఒక్కరిని పోలీసులు కాల్ డేటా ఆధారంగా గుర్తించాలన్నారు. ఒక అమ్మాయిని తన ఇష్టంతో పని లేకుండా ప్రేమిస్తున్నానని వెంటపడి తిరగడమే కాకుండా ఆమె తిరస్కరించిందని పగ పెంచుకొని చంపడం అత్యంత దారుణమన్నారు. అలేఖ్యను చంపుతుండగా శ్రీకాంత్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన అలేఖ్య వదిన జయశీలను సైతం విచక్షణారహితంగా నరకడం, ఆమె మూడేళ్ల చిన్నారి బాలుడు రియాన్స్‌పై కూడా దాడి చేయడం చూస్తే శ్రీకాంత్‌లో ఉన్న క్రూరత్వానికి అద్దం పడుతుందన్నారు. అలేఖ్య కుటుంబానికి మనోధైర్యం ఇచ్చేలా ప్రభుత్వం అండగా నిలబడాలని అఖిల పక్షం నాయకులు కోరారు. ప్రభుత్వం తరపున అలేఖ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలేఖ్య హత్యకు నిరసనగా ఈ నెల 19న ఖానాపూర్‌లో మహా ధర్నాకు వారు పిలుపునిచ్చారు. దశల వారీగా తమ పోరాటం కొనసాగుతుందని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసే వరకు వెనుకడుగు వేసేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ హత్య కేసులో వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ కొనసాగిస్తేనే సామాన్యులకు చట్టాలపై, న్యాయ వ్యవస్థపై నమ్మకం కుదురుతుందన్నారు. అలేఖ్యకు జరిగిన అన్యాయం దేశంలో మరో ఆడబిడ్డకు జరగకూడదంటే ఈ హత్య ఉదంతం వెనుక ఉన్న వారందరూ కఠినంగా శిక్షింపబడాలన్నారు. అనంతరం విశ్రాంతి భవనం నుంచి ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లిన అఖిల పక్షం నాయకులు ర్యాలీగా వెళ్లారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల, ప్రజా సంఘాల నాయకులు జి. రాజు, ఎం. సతీష్, ఎం. ప్రవీణ్, జన్నారపు శంకర్, రామిడి మహేష్, సార్ల నర్సయ్య, భూమన్న, కత్తుల శ్రీకాంత్, విపిన్ సింగ్, కౌన్సిలర్ సంతోష్, తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య, డాకూర్ తిరుపతి, వికాస్ కుమార్, కే. వెంకటస్వామి, నవీన్, బొమ్మెన రాజ్ కుమార్, తదితరులు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొమురం భీమ్ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

- ఈ నెల 20న బాసరలో బస్సు యాత్ర ప్రారంభం
- బీజేపీ నాయకులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 17 : ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే కొమురం భీమ్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ, బస్సు యాత్ర ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డిలు కోరారు. శనివారం బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు. మొదటి రోజు అస్సాం ముఖ్యమంత్రి బిష్వంత్ శర్మ హాజరవుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతిపై పోరాటం చేయడంతో పాటు ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పూజలు నిర్వహించిన అనంతరం బస్సు యాత్రను ప్రారంభిస్తారన్నారు. అనంతరం భైంసాలో జరిగే బహిరంగ సభలో అస్సాం ముఖ్యమంత్రి హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం కల్లూరు, నర్సాపూర్‌లలో రోడ్ షోం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం నిర్మల్‌లో కూడా బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభలకు దాదాపు పదిహేను వేల జన సమీకరణ చేయనున్నట్లు తెలిపారు.

ఇంటి వద్దకే సమ్మక్క సారక్క ప్రసాదం : డీఎం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 : సమ్మక్క సారక్క జాతరకు వెళ్లలేని భక్తులకు ఇంటి వద్దకే ప్రసాదం అందేలా ఆర్టీసీ సౌకర్యం కల్పిస్తోందని ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 299 చెల్లించి లాజిస్టిక్ కౌంటర్లలో మేడారం ప్రసాదం (బంగారం) బుక్ చేసుకోవచ్చునన్నారు. జాతర పూర్తయిన తరువాత ఆర్టీసీ సిబ్బంది ఇంటికే తీసుకొచ్చి ప్రసాదం ఇస్తారని తెలిపారు.

తానూర్‌లో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

తానూర్ , ఫిబ్రవరి 17 : తానూర్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించగా.. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో ధనశ్రీ (కేజీబీవీ పాఠశాల), ద్వితీయ స్థానంలో ఎస్ అఖిల(ఎల్వి పాఠశాల)లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తాలోడ్ సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తానూర్‌లో టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు